ఆదివారం 19-07-2026

నినాదం సాహితీ లహరి

నిఖార్సైన జర్నలిజం

Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం నినాదం పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064

నగరం నిద్రపోతున్న వేళ

ఫుట్ పాత్‌ల అంచున
కొందరు మనుషులు తమ ఉనికిని వెతుక్కుంటారు!
చిరిగిన దుప్పట్ల తెరల వెనుక
ఆకాశపు కొలతలు కొలుస్తూ నిద్రిస్తారు!

పగలంతా సిగ్నల్ దగ్గర అడుక్కున్న చేతులు
అర్ధరాత్రి వేళ
పాత పేపర్ల మంచంపై అలిసి వాలిపోతాయి!

నగరం నిద్రపోతూనే ఉంటుంది
కానీ వీరు మాత్రం
ఆకాశ హర్మ్యాల వెలుగుల నీడల్లో
నిశ్శబ్ద అగ్నిపర్వతాల్లా రగులుతూనే ఉంటారు!"

ట్రాఫిక్ హోరు నిశ్శబ్ద మైనా
వాళ్ల ఆకలి కేకలు మాత్రం
నిశీధిని చీల్చుకుంటూ వినిపిస్తాయి!
గూడు లేని జీవుల తలరాతలపై
రాత్రి కత్తిలా వేలాడుతూ ఉంటుంది!
వాళ్ల కళ్ళల్లో వచ్చే కలలు సైతం
రేపటి ఆకలిని తీర్చే వేటలో అలసిపోతాయి!

రాతి గుండెలు కరిగితే
నిరాశ్రయుల కళ్ళల్లో ఆశాకిరణం వెలగదా?
వాడుకోని పాత వస్త్రాలు
ఉపయోగించుకోని ఖాళీ భవనాలు
నిరాశ్రయులకు ఆశ్రయాలైతే ఎంత బాగుండు?

నగరం నిద్రపోతూనే ఉంటుంది
కానీ ఎక్కడో ఒకచోట
కన్నీటిని తుడిచే ఆత్మీయ హస్తం
మానవత్వాన్ని బ్రతికిస్తూనే ఉంటుంది!

నగరం నిద్రపోవచ్చు
కానీ మనస్సాక్షికి మాత్రం నిద్ర ఉండదు!

(స్వర్ణాంధ్ర అధినేత డా.గుబ్బల రాంబాబు
గారి సేవలను చూసిన ఆనందంలో)

డా.గూటం స్వామి, రాజమహేంద్రి
9441092870

తెలంగాణ భాషలో పలుకుబడులు!!

తెలంగాణ భాష, యాస మరియు అందులోని పలుకుబడులు మన ప్రాంత సంస్కృతికి ,చారిత్రక వైభవానికి మరియు ప్రజల జీవన విధానానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తాయి. శతాబ్దాల కాలంగా వివిధ రాజరికాల పాలన , ముఖ్యంగా నిజాం నవాబుల పాలన ప్రభావం వల్ల తెలంగాణ తెలుగు భాషలు ఉర్దూ, పర్షియన్, మరాఠీ, కన్నడ పదాలు సహజంగా కలిసిపోయి, ఒక విలక్షణమైన రూపాన్ని సంతరించుకున్నాయి. మన తెలంగాణ భాషా కేవలం ఒక సంభాషణ మాధ్యమం మాత్రమే కాదు; అది ఆయా అంతలా శ్రమజీవుల స్వేదం, ఉనికి , మట్టి వాసన మరియు ఆత్మీయతల కలయిక. తెలంగాణ పలుకుబడులలో కనిపించే నిష్కల్మషత్వం, అందులోనే సామెతలు, పొడుపు కథలు, జాతీయాలు నిత్య జీవితంలోని కష్టసుఖాలను హాస్యాన్ని, వ్యంగాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తాయి. తెలంగాణ భాష పలుకుబడులు అంటే ముఖ్యంగా చెప్పాల్సింది ఏమిటంటే మన తెలంగాణ పల్లెల్లో జీవన విధానంలో నిత్యం మాట్లాడుకునే స్వచ్ఛమైన సహజమైన తెలుగు భాష నుడికారాలని తెలియజేయవచ్చు. ఇవి కేవలం పదాలు మాత్రమే కాకుండా వాటి ఉచ్చారణలో ఉండే విలక్షణతను, సంస్కృతిని, ఆచారాలను, సంప్రదాయాలను, జీవన విధానాన్ని ప్రతిబింబిస్తాయి. ముఖ్యంగా తెలంగాణ భాష, యాస, పలుకుబడులు అనేవి మన తెలంగాణ మట్టి పరిమళాన్ని, జీవన విధానాన్ని, తెలంగాణ వైభవాన్ని, ప్రత్యేకతను చాటుతాయి. ఇవి సామాన్యుడి హృదయానికి హత్తుకుని నుడికారాలుగా నిమగ్నమైపోయాయి. తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సెప్టెంబరు 9న తెలంగాణ భాషా దినోత్సవం అధికారికంగా నిర్వహిస్తారు. "తెలంగాణ రచయిత కాళోజీ నారాయణరావు 100వ జయంతి సందర్భంగా.. కాళోజీ పుట్టినరోజైన సెప్టెంబరు 9ని తెలంగాణ భాషా దినోత్సవంగా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది." తెలంగాణ ప్రజల గుండె చప్పుడు, ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ఈ దినోత్సవాన్ని ప్రకటించింది.ఈ ప్రత్యేక రోజున తెలంగాణ భాష, సాహిత్యం మరియు సంస్కృతిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం, పాఠశాలలు మరియు కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. కవి కాళోజీ నారాయణరావు చేసిన సాహిత్య సేవలను, తెలంగాణ మాండలికం యొక్క గొప్పతనాన్ని ఈ వేడుకల్లో గుర్తుచేసుకుంటారు. ఈ దినోత్సవం సందర్భంగా ఉత్తమ కవులు, రచయితలకు తెలంగాణ ప్రభుత్వం కాళోజీ పురస్కారం అందజేసి సత్కరిస్తుంది. ఈవిధంగా ప్రజాకవి కాళోజీ నారాయణరావు అన్నట్లు "బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష కావాలి." దక్కన్ పీఠభూమి చరిత్ర సంస్కృతి, నిజాం పాలన ప్రభావం వల్ల ఉర్దూ పదాలు కూడా ఈవిధంగా మన తెలంగాణ భాషలో చేరినాయి.

ఇప్పుడున్న తెలుగు వ్యవహారిక భాష పూర్తిగా సంస్కృతమయై ఉంది. తెలంగాణ భాషలో ఎలాంటి అస్పష్టత లేదు. కారణం దేశీయ పద్ధతిలో తెలుగును గానం చేసే మౌలిక తత్వం, శ్రమైక జీవన సంస్కృతి, మానవీయమైన ఆదాన ప్రదనాలను తావునిచ్చే సహృదయత తెలంగాణ గడ్డలో ఉంది. ఇక్కడి జీవన విధానంలో నిస్వార్థ చింతన ఉంది. అందుకే తెలంగాణ పేరు సార్థకమైంది. తెలంగాణ భాషా పదాల సొగసు, మాధుర్యం,సృజనాత్మకత, మౌలికత, సార్థకత తెలంగాణ మట్టి వాసనాలు భాషాపరమైన అనేక విషయాల్లో ఇతర భాషలతో పోల్చుకుంటే తెలంగాణ తెలుగు భాషలో స్పష్టత కొట్టాచ్చినట్లు కనబడుతుంది. ఖ, ఘ,ఛ,ఝ,ఠ,ఢ,థ, ధ,ఫ,భ మొదలగు మహాప్రాణాలు వాటి ప్రయోగాలు ద్రావిడ భాషల్లో లేనట్లే తెలంగాణ తెలుగులో లేవు. క,చ,ట,త,ప, లు అనే శ్వాసాలే కొన్నిసార్లు నాదాలుగా ఉచ్చరింపబడ్తాయి.

తెలుగు భాషలో ఇవి గ,జ,డ,ద,బ లుగా మారుతుంటాయి. తెలంగాణ తెలుగు భాషలో శ,ష,స లకు మధ్య భేదం కనిపించదు. తెలంగాణ రాష్ట్ర సాధనలో భాష ఒక కీలక పాత్ర పోషించింది. ఉద్యమ సందర్భంగా అచ్చమైన తెలంగాణ పలుకుబడిలో కెసిఆర్ చేసిన ప్రసంగాలు తెలంగాణ సమాజాన్ని ఉత్తేజపరిచాయి. సీమాంధ్ర పాలకుల హయాంలో తెలంగాణ పలుకుబడిలో ఎవరైనా మాట్లాడడానికి వెనుక ముందు ఆడేవారు. అలాంటి పరిస్థితుల్లో తెలంగాణ భాషను ఆయుధంగా చేసుకుని కెసిఆర్ ఉద్యమాలోకి దిగారు. అడుగడుగునా తెలంగాణ భాషలో సాగే కెసిఆర్ ప్రసంగాలు తెలంగాణ ప్రజలకు కట్టి పడేశాయి. "నీళ్లు, నిధులు, నియామకాలు" ప్రధానంగా ఈ మూడు అంశాలపై తెలంగాణ ప్రజలు ఉద్యమించారు. ఈ మూడే కాదు తెలంగాణ ఉద్యమానికి బలమైన కల్చరల్ కోణం కూడా ఉంది. అనేక ప్రత్యేకతను సొంతం చేసుకున్న తెలంగాణ భాషకు ఇతర సాంప్రదాయాలకు సరైన గుర్తింపు లభించడం లేదన్న ఆవేదన కూడా ఉంది. ప్రత్యేక రాష్ట్రం కోసం సాగిన ఉద్యమంలో తెలంగాణ భాషకున్న ప్రాధాన్యం ప్రత్యేకమైంది.

తెలంగాణ ప్రజలు ఎంతో అర్థవంతమైన భాష మాట్లాడుతున్నారు. ఉదాహరణకు మేర పదానికి ఇతర ప్రాంతాల వారు దర్జీ అంటారు. ఇది ఉర్దూ పదం వాస్తవానికి తెలంగాణలో వాడే మేర పదాన్ని పరిశీలిస్తే పొలిమేర, ఆమేరకు, ఈమేరకు అనే మౌఖిక ప్రయోగాలు తెలంగాణలో ఉన్నాయి. మేరల అనగా హద్దులమేరకు అని ఉంది. అనగా మేర వారు గుడ్డల్ని కత్తిరించి కుట్టే వ్యక్తిమేర. ఇది అసలు సిసలు తెలుగు పదం. సోయి, సోయిలేదు, సోయిసుద్ధి, సోయిసెప్పటం లాంటివన్నీ తెలుగు పదాలు. ఈ విధంగా తెలంగాణ తెలుగు భాషా సౌందర్యంలో కొన్ని స్పష్టమైన విలక్షణత్వాలను గుర్తించవచ్చు. భాషలో అచ్చమైన తెలుగు పోకడలు ఇక్కడ ఉన్నాయి. తెలంగాణ తెలుగులో ఉర్దూ పదాలు అత్యంత జమిలిగా రీతిలో కలగలసి పోవటం గొప్ప విశేషం. తెలంగాణ తెలుగులో దీర్ఘాలు బాగా పొడవైన సమాసాలు సంస్కృత పదా భూయిష్టమైన తీరుతెన్నులు బాగా తక్కువ. నలిమెల భాస్కర్ 'తెలంగాణ పదకోశం' లో అనేక పదాల కూర్పు జరిగింది. తెలంగాణ పద సౌందర్యాన్ని కొంతవరకు బయలు ఏర్పగలిగిన అయినా ఇట్లా అంటాడు. "ఏ భాషకైనా జవజీవాలు, జాతీయాలు సామెతలే!... తెలంగాణ వాసుల పలుకు పలుకులో నుడికారం ఉంటుంది. చల్లగా ఉండేది చల్ల (మజ్జిగ), ఎర్రగా ఉండేది ఎర్ర (వానపాము), లాగుతూనే వేసుకునేది లాగు = ప్యాంటు, అంగాన్ని కప్పి ఉంచేది = అంగి, కంకుతూ తింటం గనుక కంకి. ఇలాంటి మాటలెన్నో నలిమెల భాస్కర్ మనమందు ఉంచాడు. అదేవిధంగా "గుమ్మి" అనేది ప్రముఖ తెలంగాణ కథా రచయిత మరియు నవలాకారుడైన డా. కాలువ మల్లయ్య రచించిన ఒక విశిష్టమైన పుస్తకం. తెలంగాణ అస్తిత్వ చైతన్యం, అక్కడి జీవన విధానంపై విస్తృతంగా రచనలు చేసిన ఆయన, ఈ పుస్తకం ద్వారా స్థానిక భాషా సంపదను అక్షరబద్ధం చేశారు. ఈ పుస్తకం "తెలంగాణ వాడుక భాషా పలుకులు, పలుకుబడులు" అనే అంశంపై రాయబడింది. తెలంగాణ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు నిత్యం మాట్లాడే విలక్షణమైన పదాలు, సామెతలు, జాతీయాలు మరియు మరుగున పడిపోతున్న పలుకుబడులను ఇందులో పొందుపరిచారు. 'గుమ్మి' అంటే తెలంగాణ పల్లెల్లో ధాన్యాన్ని దాచుకునే పెద్ద బుట్ట లేదా నిల్వ పాత్ర. పల్లె ప్రజల నోట పలికే అమూల్యమైన భాషా పదాలను భద్రపరిచే ఒక నిల్వ పాత్ర లాంటిది కాబట్టే ఈ పుస్తకానికి ఆయన "గుమ్మి" అని పేరు పెట్టారు.

తెలంగాణలో మనుషులు సహృదయాలు. వారి జీవితం నిర్మలమైనది. కల్మషం, కుట్ర కుతంత్రాలు ఎఱగనోళ్లు, వారి కార్యక్రమాల్లో ఎన్నో పలుకుబడులు నిత్యం తానం ఆడుతాయి. కొన్నింటిని పరిశీలిద్దాం; ఆన గొట్టి ఎల్సినట్టు (లొల్లి లొల్లి గా ఉండి ఒక్కసారి నిశ్శబ్దం ఆవరిస్తే), సెర్లనీల్లు సెరెనుక వడ్డాయి (అంతా అయిపోయిందని తెలపటానికి), ఎరుకైందా! (నిజాన్ని తెలపటానికి), ఎవ్వటి సిప్ప ఎన్గల్లే (ఫలితం శూన్యం అయినందుకు), తేనత్తకున్న గుడ్డత్త నయం, (ఆశయవాదాన్ని వ్యక్తపరచటానికి), ఏందెల్వని ఎల్లపాయె గుర్గలేత్తె కరిగిపాయే (తెలిసే కూడా తెలియనట్లు నటిస్తే), నాలుక తాటిమట్టా (అబద్ధాలు మాట్లాడితే), మసివూసి మారేడు కాయసేసుడు (మోసం చేయటాన్ని) కండ్లల్ల కారం గొట్టనట్టు (నిజాల నిగ్గును తేల్చటానికి), గజ్జెల గుర్రం (కయ్యానికి), బసవన్న (అమాయకత్వానికి), కడ్డుగాడు (కఠినత్వానికి తెలపడానికి), కన్నట్టు (మాయాజాలం, ఇంద్రజాలం), కట్రౌతు (కట్టటానికి ఉపయోగించే రాయి), గత్కుడు (తాగటానికి ఉబలాట పడితే) గల్మ (కడప), గూబ గుయ్యిమీన్నీది, సెంప సెల్లుమనుడు, సిల్కనుసెప్పినట్లు,సెప్పెల రాయి, సెవుల జోరీగ, కంట్లె నలుసు, జెన్కం,తొన్కం,జప్పున,జలకం, ఈపు ఇమానమై మోగింది,మెత్త, తంతె, మెట్టు, ఇలాంటివి అనేకం నిత్య జీవితంలో మన ముందు వాడబడే పదజాలం.

తెలంగాణ పలుకుబడులలో తెలుగు భాష యొక్క ప్రాచీన రూపాలు కవిత పదాలు ఇప్పటికీ సజీవంగా ఉన్నాయి అని తెలుస్తుంది.

ఉదా: "తర్వాత" అనే పదానికి "అటెనక" అని
"స్పృహ" అనే పదానికి "సోయి" అని వ్యవహరిస్తారు.

ఈ విధంగా శబ్ద సౌందర్యాన్ని భావ తీవ్రతను అద్భుతంగా వ్యక్తపరుస్తాయి. తెలంగాణ ప్రాంతాన్ని పరిపాలించిన నిజాం పాలన మరియు దక్కని సంస్కృతి కారణంగా మన తెలంగాణ తెలుగు భాషలో చాలా ఉర్దూ, హిందీ పదాలు కలిసిపోయినాయి.

ఉదా: ఆసుపత్రిని – "దవాఖానా"
అద్దెను – "కిరాయి", పరియాను – "జాగా"
1. అంగడి – సంత 2. యాది – జ్ఞాపకం
3. పెయ్యి – శరీరం 4. పత్తా – చిరునామా
5. సాలు – సరిపోవడం 6. పానం – ప్రాణం
7. పాశం – పాయసం 8. వెతలు – కష్టాలు
9. విముక్తి – స్వేచ్ఛ 10. తెగువ – ధైర్యం
11. చల్ల – మజ్జిగ 12. బువ్వ – అన్నం
13. వికారు – అసహ్యంగా 14. పోరి – చిన్నపిల్ల
15. వనరు – దొరికే స్థలం 16. పోరగాడు – చిన్నపిల్లోడు
17. తిర్రి – పిచ్చి 18. మొకం – ముఖం
19. వెలయాలు – వేశ్య 20. పయలం – జాగ్రత్త

ఒకప్పుడు మన తెలంగాణ భాషను కేవలం సినిమాల్లో హాస్యానికి లేదా విలన్ పాత్రలకే పరిమితం చేసేవారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత సాహిత్యకారులు, కవులు, రచయితలు తమ తమ రచనల్లో, తెలంగాణ భాషలో రచనలు రాయడం జరిగింది. తెలంగాణ వాడుక భాష యొక్క ప్రాముఖ్యతను, ప్రత్యేకతను చాటుతూ పలుకుబడులను ప్రజలకి తెలియజేశారు. అదేవిధంగా ప్రసారాల మాధ్యమంలో భాగంగా ముఖ్యంగా టీవీ చానల్స్ లో చూసుకుంటే (ఉదా: వీ6 న్యూస్ – తీన్మార్ వార్తలు, మన తెలంగాణ భాషకు ఉన్న గొప్పతనాన్ని మాండలిక సొగసును ప్రపంచానికి చాటి చెప్పారు. ఇలాగే మరికొన్ని చానల్స్ లో కూడా తెలియజేస్తున్నాయి వాటిలో , ధూంధాం న్యూస్, మల్లన్న వార్తలు, పటాస్ వార్తలు, మరికొన్ని ఇతర టీవీ చానళ్ల మాధ్యమాల్లో తెలంగాణ భాష యొక్క పలుకుబడులు వినిపిస్తున్నాయి. అలాగే సినిమాలో కూడా చాలా వచ్చాయి. తెలంగాణ భాషతో, యాసతో, పలుకుబడులతో అని చెప్పవచ్చు. వాటిలో కొన్నిటిని తెలియజేస్తున్నాను. ఫిదా, బలగం, మల్లేశం, లవ్ స్టోరీ, జాతి రత్నాలు, డిజె టిల్లు, దసరా, భగవంత్ కేసరి, ఒసేయ్ రాములమ్మ, చిల్లర దేవుళ్ళు, మా భూమి, రుద్రమదేవి, జై బోలో తెలంగాణ, మరికొన్ని సినిమాలో కూడా వచ్చాయని తెలియజేయవచ్చు.

– జాటావత్ రాజు
తెలంగాణ విశ్వవిద్యాలయం,
నిజామాబాద్.
9347196264,

వ్యాకరణం లేని జీవనం

ఈ కవితలో మేటఫర్లు
సరిగ్గా కుదరటం లేదు.

ప్రాస ఎక్కడో మధ్యలో
తప్పిపోయింది.

చివరి లైన్ చదివాక గాని
అర్థం కావటం లేదు.
అయినా రాస్తూనే వున్నాను.

నేను కూడా అంతే కదా!
వ్యాకరణం లేని జీవనం.

మాట తడబాటు
కోపం ఎక్కువ
ఓపిక తక్కువ.

కలలు పెద్దవి
కాళ్ళు చిన్నవి.

పరిపూర్ణత కోసం
పరిగెత్తి పరిగెత్తి
అలిసిపోయాను.

ఇప్పుడు లోపాలతో
బతకడం నేర్చుకున్నాను.

ఈ కవిత బాగాలేదు
అయినా పర్వాలేదు
నేను కూడ బాగా లేను.

అయినా మనిద్దరం
కలిసి బతకాలి మరి!

ఏటూరి నాగేంద్ర రావు.
7416665323

తెలుగు కథా నిర్మాణంలో వస్తు వైవిధ్యం
మానసిక, తాత్విక విశ్లేషణాత్మక అధ్యయనం

మానవ అంతరంగం ఒకే భావంతో నిర్మితమయ్యే స్థలం కాదు. అందులో పరస్పర విరుద్ధమైన కోరికలు, నమ్మకాలు, భయాలు, ఆశలు సహజీవనం చేస్తుంటాయి. అందుకే ఆధు నిక కథల్లో నాయకుడు సంపూర్ణ మంచివాడిగానీ, సంపూర్ణ చెడ్డవాడిగానీ కనిపించడు. అతని నిర్ణయాలు సందిగ్ధతతో నిండిపోతాయి. ఒక సందర్భంలో ధైర్యంగా కనిపించిన వ్యక్తి, మరో సందర్భంలో బలహీనపడ తాడు. ఒక విలువను సమ ర్థించిన వ్యక్తే, మరో పరిస్థితిలో అదే విలువను వదిలి పెడతాడు. ఈ వైరుధ్యాలను రచయితలు మానవ స్వభా వంలోని సహజ సంక్లిష్టతగా స్వీకరించారు. ఈ విధానం కథను నైతిక తీర్పుల నుంచి మానవ స్వభావాన్ని అర్థం చేసుకునే దిశగా మళ్లించింది. తెలుగు కథలో స్త్రీ పాత్రల పరిణామం కూడా వస్తు వైవిధ్యాన్ని అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన ఆధారం.

ప్రారంభ దశలో కుటుంబానికి కేంద్రబిందువుగా కనిపించిన స్త్రీ, తరువాతి కాలంలో తన స్వరాన్ని వెతుక్కునే వ్యక్తిగా రూపుదిద్దుకుంది. ఓల్గా కథల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. ఆమె రచనల్లో కుటుంబం ఒక భావోద్వేగ వ్యవస్థ మాత్రమే కాదు. అధికార సంబం ధాలు పనిచేసే సామాజిక నిర్మాణం కూడా. ప్రేమ, వివాహం, మాతృత్వం, స్వేచ్ఛ వంటి అంశాలను ఆమె కొత్త ప్రశ్నలతో పరిశీలించారు. ఈ ప్రశ్నలు వ్యక్తిగత జీవితానికే పరిమితం కావు. సమాజం నిర్మించిన విలువలనే పునఃపరిశీ లిస్తాయి. అందువల్ల స్త్రీవాద కథలు కొత్త పాత్రలను మాత్రమే సృష్టించలేదు. కథా వస్తువుకు కొత్త ఆలోచనా పరిధిని కూడా జోడించాయి. దళిత కథా సాహిత్యం తెలుగు కథలో మరో నిర్ణాయక మలుపు. ఇక్కడ బాధ ఒక భావోద్వేగం కాదు. చారిత్రక అనుభవం. అవమానం ఒక వ్యక్తి జీవితానికి పరి మితం కాదు. తరతరాల సామాజిక నిర్మాణంలో భాగం. అందువల్ల దళిత కథలు కేవలం వివక్షను చిత్రించవు. వ్యక్తి గౌరవాన్ని ఏ శక్తులు హరిస్తాయి? గుర్తింపు కోసం పోరాటం ఎందుకు అవసరమవుతుంది? సమానత్వం చట్టంలో ప్రకటించిన విలువగా మిగిలిపోతుందా, జీవన అనుభవంగా మారుతుందా? వంటి ప్రశ్నలను ముందుకు తీసుకువస్తాయి. ఈ కథలతో తెలుగు కథా వస్తువు మరింత విశాలమైన మానవీయ, సామాజిక పరిధిని సంతరించుకుంది. కథ అణగారిన వర్గాల జీవితాలను నమోదు చేయడమే కాక, చరిత్ర మౌనంగా వదిలేసిన స్వరాలకు సాహిత్య భాషను అందించింది. కథా వస్తువులో వచ్చిన విస్తరణ కథా నిర్మాణాన్నీ ప్రభావితం చేసింది. సంప్రదాయ కథ ఒక రేఖీయ ప్రయాణంలా సాగేది. ప్రారంభం, మధ్య, ముగింపు అనే క్రమం కథను నడిపించేది. ఆధునిక కథలో ఆ క్రమం సడలింది. జ్ఞాపకం వర్తమానంలోకి ప్రవేశించింది. వర్తమానం గతాన్ని వెతకసాగింది. పాత్ర అంతరంగంలో మెదిలే ఒక చిన్న ఆలోచన కథను ఎన్నో కాలఖండాల మీదుగా ప్రయాణింపజేసింది. సంఘటనల వరుసను అనుసరించే కథనం స్థానంలో అనుభవాల అంతఃసంబంధాన్ని అన్వేషించే కథనం ప్రాధాన్యం పొందింది. శిల్పంలో వచ్చిన ఈ మార్పు అలంకార ప్రయోగం కాదు. వస్తువు కోరుకున్న సహజ రూపం. అంతరంగం కాలాన్ని గడియారంలా కొలవదు. జ్ఞాపకం, అనుభవం, ఆశ, పశ్చాత్తాపం ఒకే క్షణంలో కలిసిపోతాయి. ఆధునిక కథ ఆ మానసిక ప్రవాహాన్నే తన నిర్మాణంగా స్వీకరించింది. శిల్పం, వస్తువు పరస్పరం వేరుచేసి చూడలేని సృజనాత్మక అంశాలు. ఒక రచయిత ఎంచుకున్న వస్తువే అతని కథనాన్ని నిర్ణయిస్తుంది. అంతర్ముఖ సంఘర్షణను చెప్పాలనుకున్న రచయిత సంఘటనల వేగంపై ఆధారపడలేడు. మౌనం, విరామం, సూచన, ప్రతీక, అంతర్మ నస్సు సంభాషణ వంటి శిల్పసాధనాలు అక్కడ అవసరమ వుతాయి. అదే సామాజిక ఉద్యమాన్ని చిత్రించే కథలో సంభా షణలు, ఘర్షణలు, చర్యలు ఎక్కువ ప్రాధాన్యం పొందు తాయి. అందువల్ల కథా నిర్మాణాన్ని వస్తువు నుంచి వేరు చేసి విశ్లేషించడం సాధ్యం కాదు. రెండూ ఒకదానిని ఒకటి నిర్మించుకునే సృజనాత్మక సంబంధంలో ఉంటాయి. తెలుగు కథలో ప్రతీకాత్మకత కూడా వస్తు వైవిధ్యానికి కొత్త అవకా శాలను తెరిచింది. ప్రత్యక్షంగా చెప్పలేని అనుభవాలను రచయితలు ప్రతీకల ద్వారా వ్యక్తీకరించారు. ఒక ఇల్లు కుటుంబానికి మాత్రమే ప్రతీకగా నిలవలేదు; జ్ఞాపకాలకు, అధీనానికి, భద్రతకు, కొన్నిసార్లు బంధనానికీ రూపకంగా మారింది. వర్షం ప్రకృతి సంఘటనగా నిలవలేదు; అంత రంగ శుద్ధికి సంకేతమైంది. వెలుగు, చీకటి, దారి, గోడ, అద్దం, చెట్టు వంటి సాధారణ అంశాలు కూడా కథలో కొత్త అర్థాలను సంతరించుకున్నాయి. ప్రతీకల వినియోగం కథను సంక్లిష్టం చేయడం కోసం కాదు. మాటల్లో పూర్తిగా వ్యక్తం చేయలేని అనుభవాలకు కళాత్మక రూపాన్ని ఇవ్వడం కోసం.

సమకాలీన తెలుగు కథ మరో ముఖ్యమైన మార్పును నమోదు చేసింది. గ్రామం నుంచి నగరానికి జరిగిన వలస, విదేశీ ఉపాధి, సమాచార సాంకేతిక రంగం, డిజిటల్ ప్రపంచం, వినియోగ సంస్కృతి ఇవి అన్నీ కొత్త జీవితానుభవాలను సృష్టించాయి. ఒకప్పుడు భూమిని కోల్పోయిన రైతు కథా నాయకుడైతే, ఇప్పుడు సమయాన్ని కోల్పోయిన ఉద్యోగి, గుర్తింపును వెతుక్కుంటున్న నగరవాసి, వేర్లు మరిచిపోయిన ప్రవాస భారతీయుడు కూడా కథలోకి వచ్చాడు. ప్రపంచం మరింత అనుసంధానమైన కొద్దీ వ్యక్తి ఒంటరితనం కూడా మరింత తీవ్రమవడం సమకాలీన కథల్లో తరచుగా కనిపించే వైరుధ్యం. వందలాది డిజిటల్ పరిచయాల మధ్య ఆత్మీయ సంభాషణ కోసం తపించే వ్యక్తి ఆధునిక కథకు కొత్త పాత్రగా అవతరించాడు. ఈ వికాసక్రమాన్ని గమనించినప్పుడు ఒక విషయం స్పష్టమవుతుంది. కథా వస్తు వైవిధ్యం అనేది అంశాల సంఖ్య పెరగడాన్ని సూచించే పదం కాదు. జీవితానుభవాన్ని అర్థం చేసుకునే పరిధి విస్తరించడాన్ని సూచించే భావన. ఒకప్పుడు సమాజం కేంద్రంగా నిలిచిన కథ, తరువాత వ్యక్తిని ఆవిష్కరించింది. వ్యక్తిని అర్థం చేసుకున్న తర్వాత అతని అంతరంగాన్ని పరిశీలించింది. అంతరంగాన్ని విశ్లేషించిన తరువాత వ్యక్తిని నిర్మించే చరిత్ర, ఆర్థిక వ్యవస్థ, సంస్కృతి, లింగ సంబంధాలు, అధికార నిర్మాణాలను అన్వేషించింది. ఈ క్రమంలో కథ జీవితాన్ని వర్ణించే ప్రక్రియ నుంచి, జీవితాన్ని వ్యాఖ్యానించే సాహిత్య రూపంగా పరిణమించింది. తాత్విక దృష్టితో పరిశీలించిన ప్పుడు ఆధునిక కథ సమాధానాల కంటే ప్రశ్నలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుంది. వ్యక్తి స్వేచ్ఛకు హద్దులు ఎక్కడ మొదలవుతాయి? న్యాయం అనే భావన అన్ని వర్గాలకూ ఒకే అర్థాన్ని ఇస్తుందా? ప్రేమ సామాజిక నిర్మాణాలకు అతీత మా? ఆర్థిక అభివృద్ధి మానవ సంతృప్తిని పెంచుతుందా? జ్ఞాపకం వ్యక్తిని విముక్తి చేస్తుందా, బంధిస్తుందా? ఇలాంటి ప్రశ్నలకు కథ తుది తీర్పు ఇవ్వదు. పాఠకుడి ఆలోచనను మేల్కొలిపే పరిస్థితులను మాత్రమే సృష్టిస్తుంది. ఆ లక్షణమే కథను తాత్విక ప్రక్రియగా నిలబెడుతుంది.

తెలుగు కథా ప్రయాణాన్ని వెనక్కి తిరిగి చూసినప్పుడు కథ పుట్టుక నుండి సమకాలీన రచయితల వరకు ఒక నిరంతర పరిణామరేఖ కనిపిస్తుంది. రచయితలు మారారు. సామాజిక సందర్భాలు మారాయి. కథన పద్ధతులు మారాయి. ఈ మార్పులన్నింటినీ కలిపే అంతస్సూత్రం ఒక్కటే ! మనిషిని మరింత లోతుగా అర్థం చేసుకోవాలనే సృజనాత్మక తపన. అదే తెలుగు కథకు శాశ్వతమైన జీవశక్తి. తెలుగు కథా వికాసాన్ని ఒకే సూత్రంలో నిర్వచించడం సాధ్యం కాదు. ప్రతి దశ తనకు తానుగా ఒక కొత్త అనుభవ ప్రపంచాన్ని కథలోకి తీసుకొచ్చింది. సంస్కరణోద్యమం సామాజిక చైతన్యాన్ని జోడించింది. అభ్యుదయ దృక్పథం వర్గసంబంధాలను వెలుగులోకి తీసుకొచ్చింది. మనోవైజ్ఞానిక దృష్టి వ్యక్తి అంతరంగాన్ని ఆవిష్కరించింది. స్త్రీవాదం, దళిత సాహిత్యం అణచివేతకు గురైన అనుభవాలకు భాషను అందించాయి. సమకాలీన కథ ప్రపంచీకరణ సృష్టించిన కొత్త జీవన వైరుధ్యాలను నమోదు చేస్తోంది. ఈ పరిణామాలన్నింటి మధ్య కథ తన ప్రాథమిక స్వరూపాన్ని మాత్రం కోల్పోలేదు. వ్యక్తిని అర్థం చేసుకోవాలనే తపన, జీవితాన్ని ప్రశ్నించాలనే ధైర్యం, కాలాన్ని దాటి నిలిచే మానవ అనుభవాన్ని అక్షరాల్లో బంధించాలనే సృజనాత్మక ఆకాంక్ష ఇవే తెలుగు కథను నిరంతరం నవీకరించే శక్తులు. అందుకే కథా నిర్మాణంలో వస్తు వైవిధ్యం ఒక సాహిత్య లక్షణం మాత్రమే కాదు. తెలుగు సమాజం, తెలుగు జీవితం, తెలుగు ఆలోచనా ప్రపంచం నిరంతరం విస్తరిస్తున్న పరిణామానికి సజీవ సాక్ష్యం.

విర్గో : 8247045230

కాలం కోసం

కళల కలలు
కంటూ వుండండి..
సాహితీ సౌరభాల గుమ గుమలు
విరబుస్తూనీయండి..
సేవ భావన మొక్కలు పెంచేలా
మదిలోని ఆలోచనలకు
పదును పెట్టి..
మనిషి మనిషిలో
మానవత్వం విత్తనాల
మొలకలు మొలకేత్తెల
నారు పోస్తున్నే వుండండి.!
నీరు పొసే వాడు ఎవ్వడో ఒక్కడు
ఆ దేవుడి రూపంలో రాకపోతాడా.!
వాడు
మనిషిలోని మనస్సున
లోపలి మనిషి కాకపోతాడా.?
అయినా..
దారితప్పిన ఆత్మీయ అనుబంధాలకు..
కల్మషం లేని
ప్రేమ అనురాగాలతో
అడ్డుకట్ట వేసే
కాలం కోసం
నిరీక్షణ తప్పదేమో.?

- కొండ రవీందర్
9059237771

బోనాలు

ఏడాదికోసారి
ఆషాడ బోనం
అత్యంత ఘనం

లయాత్మకమైన
డప్పు చప్పుళ్లు
గజ్జెల మోతలు

భక్తిశ్రద్ధలతో
నెత్తిన బోనం
ఎత్తిన జనం

విశ్వజనీనము
ప్రజా సంక్షేమాలు
నిత్య నివేదనలు

ఊరేగింపులు
బారులుతీరి
బయలుదేరి

విశ్వసనీయము
పల్లెల నిండుగ
బోనాల పండుగ

చిత్రవిచిత్రాలు
పోత రాజుల
విన్యాసాలు

గుప్పు గుప్పుమని
గుగ్గిలం మైసాచి
అగరుబత్తుల పొగ

కనపర్తి
రాజశేఖరమ్
7382847673

ఆదివారం 19-07-2026

నినాదం నిఖార్సైన జర్నలిజం

సాహితీ లహరి

Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

సాహిత్య రచనలకు ఆహ్వానం

ప్రతి ఆదివారం *నినాదం* పత్రిక సాహిత్య అనుబంధం కోసం వ్యాసాలు, సమీక్షలు, కవితలు, చిన్న కథలును ఆహ్వానిస్తున్నాం. వ్యాసాలు రెండు పేజీలకు మించకుండా లేదా 400 పదాలలోపు ఉండేటట్లు చూసుకోవాలి. ఈ రచనలను ఈ మెయిల్ లేదా వాట్సాప్‌కు పంపించాలి.

sahityalahari0@gmail.com
Whatsapp No:6305584064



మల్లవరపు కవులతో మధురస్మృతులు

"నేను ఛందోబద్ధ కవిత్వాన్ని, స్వచ్ఛందంగా సాగిన వచన కవిత్వాన్ని కూడా ఆహ్వానిస్తాను. నిజానికి కవిత్వం అనేది విషయ ప్రధానంగానే ఉంటుంది తప్ప రూప ప్రధానంగా వుండదు. గుణానికి నేను ప్రాధాన్యం ఇస్తాను. శ్రీ జాన్ గారి కవిత్వం గుణభూయిష్ఠంగా వుంటుంది. మాధుర్య గుణం వీరి మనసులో, మాటలో పొంగులెత్తుతూ ఉంటుంది. కవికి ప్రధానంగా కావల్సిన ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాలు శ్రీ జాన్ గారిలో పుష్కలంగా వున్నాయి." అని మల్లవరపు జాన్ కవిగారి "అతుకుల బ్రతుకులు" కావ్యానికి 1981లో ప్రముఖ కవి దాశరథి రాసిన మాటలివి. అటువంటి మల్లవరపు జాన్ కవి గారి శతజయంతి ఉత్సవాలు ఏడాది నుండి ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సాహిత్య అకాడమీ వారు, జానుడి సంస్థతో కలిసి ఒంగోలులో ఒకరోజు (12 జూలై 2026) సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాహిత్య అకాడమీ, తెలుగు సలహా మండలి కన్వీనర్ ఆచార్య సి.మృణాళిని పాల్గొని శత జయంతి ఉత్సవాలను ప్రారంభించారు. జాన్ కవిగారి పద్యశిల్పాన్ని డా. సి.నారాయణరెడ్డి ప్రస్తుతించేవారన్నారు. చమత్కారం, వ్యంగ్యం, తెలుగు పలుకుబడులతో చక్కని సంభాషణాత్మక, హేతుబద్ధ శైలిలో పద్యం రాసిన జాన్ కవి పద్యకవులకు సరికొత్త స్ఫూర్తినిచ్చారన్నారు. జాన్ కవి శతజయంతి సభను కేంద్ర సాహిత్య అకాడమీ నిర్వహించడంలో ప్రధాన ఉద్దేశ్యం జాన్ కవి గారి రచనల్లో సామాజికతను, సర్వకాలీనతను సమకాలీనతను, పునర్మూల్యాంకనం చేయడమేనన్నారు. జానుడి కన్వీనర్ డా.నూకతోటి రవికుమార్ ప్రారంభ సమావేశానికి అధ్యక్షత వహించారు. ప్రముఖ కవి, విమర్శకులు ఆచార్య కోయి కోటేశ్వరరావు కీలకోపన్యాసం చేశారు. మల్లవరపు సాహిత్య భారతి అధ్యక్షులు డా.జవహర్, ప్రముఖ నాటకకర్త పాటిబండ్ల ఆనందరావు, ప్రముఖ కవి బీరం సుందరరావు, ఆచార్య విస్తాలి శంకరరావు, డా.వై.విజయానందరాజు, కవి కోట్ల వేంకటేశ్వర రెడ్డి, ఆచార్య కప్పగంతుల మధుసూదన్ , సాహిత్య అకాడమీ ప్రతినిధి చంద్రశేఖర్ లతో పాటు మల్లవరపు జాన్ కవి గారి మనవలు, కమర్షియల్ ట్యాక్స్ అసిస్టెంట్ కమీషనర్లు మల్లవరపు సుధాకర రావు, మల్లవరపు ప్రభాకరరావు, మనకాలం మాస పత్రిక సంపాదకులు కత్తి కళ్యాణ్, డా.కోలాశేఖర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నేను మల్లవరపు జాన్ కవి గారి కవిత్వ శిల్పం గురించి మాట్లాడాను. అకాడమీ నిర్వహించిన కార్యక్రమం తో పాటు దానికి కొనసాగింపుగా సాయంత్రం అనేక సాహిత్య కార్యక్రమాలను నిర్వహించారు.

ఆచార్య మృణాళిని

తెలుగు సాహిత్య చరిత్రలో మల్లవరపు కవులు అనే ఒక అధ్యాయాన్ని కేటాయించదగినంత కృషిచేసిన వారీ కవులు. మల్లవరపు జాన్ కవి, రాజేశ్వరరావు, ప్రభాకరరావు, సుధాకరరావు, రాజీవ్ తెలుగు సాహిత్యంలో విశేషమైన సేవచేసిన వారికి ప్రతియేడాది మల్లరపు జాన్ కవిగారి స్మృత్యర్థం ఒక పురస్కారాన్ని ఇస్తున్నారు. ఈ పురస్కారాన్ని 2016 నుండి ప్రారంభించారు. తొలిపురస్కారాన్ని నాకు అందించారు. అది నాకు లభించిన గొప్పగౌరవంగా భావిస్తున్నాను. జాను కవి గారు 22 జనవరి 1927లో జన్మించారు. మల్లవరపు దావీదు, శ్రీమతి రత్నమ్మ గార్లు వీరి తల్లి తండ్రులు. ఆంధ్రప్రదేశ్ లోని ప్రకాశం జిల్లాలోని చీమకుర్తివీరి జన్మ స్థలం. వీరి కుటుంబానికో ప్రత్యేకత ఉంది. వీరి కుమారుడు రాజేశ్వరరావు, కుమార్తె కోటి రత్నమ్మ, మనవడు ప్రభాకరరావులు మంచి కవులు. ఒక మనవడు మంచి చిత్రకారుడు. జాన్ కవి గారు 12 ఆగష్టు 2006 న మరణించారు. ఆయన కవిత్వం రాశారు. ఆ కవిత్వాన్ని ఛందోబద్ధ పద్యంలో రాశారు. సాంసన్ - డెలీలా నాటకం రాశారు. అది క్రైస్తవ సాహిత్యేతివృత్తం. అందులోనూ కొన్ని పద్యాలున్నాయి. 'సజ్జనాను రక్తిజాను సూక్తి' మకుటంతో ఒక సూక్తి శతకం రాశారు. అది అనేక భావాల సంగమం. రేడియోలో సమస్యపూరణం పేరుతో వారం వారం ప్రసారమైన కార్యక్రమంలో అనేక సమస్యలకు పద్యపూరణ చేశారు. తన కృతులను ప్రచురించినవారినీ, ప్రచురించడానికి సహకరించినవారినీ, తన రచనలపై స్పందించినవారినీ అభినందిస్తూ పద్యాలు రాశారు. కవిత్వంలో తనకిష్టమైన ప్రాచీనాధునిక కవులనూ, కావ్యాలనూ స్పర్శించారు.

మాతృభాషపై, మాతృభూమిపై అభిమానాన్ని కురిపించారు. వీటిని పరిశీలించినప్పుడు జాన్ కవి భిన్న వస్తువులను తీసుకొని కవిత్వం రాశారని తెలుస్తుంది. కవి భిన్న వస్తువులను తీసుకోవడం వల్ల మాధుర్యం వస్తుందా? తీసుకున్న వస్తువులను కవిత్వీకరించడంలో మాధుర్యం వ్యక్తమవుతుందా? అనే ప్రశ్న ప్రతి కవి గురించీ, ప్రతి రచన గురించీ వేసుకోవలసి వస్తుంది. ఈ ప్రశ్నకు వచ్చిన సమాధానాల సమాహారం నుండే కవిత్వ స్థాయి తెలుస్తుంది. కవి వచ్చిన సమాజం నుండి కూడా కవిత్వ స్థాయిని చూడాలి. కవిత్వ మాధుర్యాన్ని గుర్తించాలి. అందుకేనేమో కరుణశ్రీ ..

"పనస తొనలకన్న పాల మీగడకన్న
మధువుకన్న ముగ్ధ వధువు కన్న
మల్లవరపు కవిత మధురాతి మధురమ్ము
"జాను" తెనుగు మేలి "జాను తెనుగు"

అని జాన్ కవిగారిని ప్రశంసించారు. జాన్ కవి అప్పకవి నిర్ణయాన్ని ఖండించడంతోనే ఆగిపోలేదు. మహాకవి జాషువా కవిత్వంతో కలిసి పయనించారు. కవిత్వం రాయడానికి కులం అడ్డంకి కాదని నిరూపించిన జాషువాని ప్రశంసించారు.

కవిత్వంలోని వస్తువు, అభివ్యక్తులను బట్టి గుర్తించటమే ప్రతి కవికీ నిజమైన గుర్తింపు. అలాంటప్పుడు కుల, మత, ప్రాంతీయ భేదాలు పొడచూపవు. నిజానికి కవిత్వాన్ని ఇష్ట పడటానికి ఈ కొలమానాలు చాలా మంది చూస్తుంటారు. వీటితో పాటు అత్యంత ముఖ్యమైనది భావజాలం. భావజాలం నచ్చినప్పుడు పైవేమీ పెద్దగా ప్రభావాన్ని చూపకపోవచ్చు. ఇవేమీ కాకుండా, కేవలం కవిత్వాన్నే ఇష్టపడేవాళ్ళూ ఉంటారు. అటువంటి వాళ్ళు చాలా అరుదు. అసలు విషయం ఏమిటంటే, ఇటీవల సాహితీకౌముది త్రైమాసిక పత్రిక ఏప్రిల్ 2007 సంచిక చూశాను. దాన్ని మధుర కవి శ్రీ మల్లవరపు జాన్ 80 వ జయంతి ప్రత్యేక సంచికగా ప్రచురించారు. తెలుగు పద్య సాహిత్యాన్ని ప్రోత్సాహించే పత్రిక. దీనిలో చాలా మంచి వ్యాసాలు, కవితలు ఉన్నాయి. జాన్ కవి గారి గురించే కాకుండా, మరికొన్ని శీర్షికలు కూడా ఉన్నాయి. సాహితీ వార్తలు ఉన్నాయి. వ్యవస్థాపక ప్రధాన సంపాదకులు శిష్ట్లా వెంకట్రావు గారు మంచి సంపాదకీయం రాశారు. సంచికలో ఉన్న అన్ని వ్యాసాల పెట్టు ఆ సంపాదకీయంలో ఉంది. జాన్‌కవిగారి సమగ్ర వ్యక్తిత్వం ఆ సంపాదకీయంలో పెట్ట గలిగారు. సనాతన సంప్రదాయాన్ని మన్నిస్తూనే వాటిలోని బలహీనతలను త్రోసి రాజనగల కవులలో ఒకరుగా జాన్ కవిని బాగా అంచెనా వేయగలిగారు. "దైవభక్తి, దేశభక్తి, సామాజిక స్వభావం, మృదుస్వాభావికత ఆయన వ్యక్తిత్వాన్ని మహోన్నత స్థాయిలో నిల్పిన కవిగా జాన్ కవి గారిని అభివర్ణించారు. షేక్ ఆలీ, ఎం.పి. జాను కవి, ఉన్నం జ్యోతి వాసు, మల్లవరపు రాజేశ్వరరావు, మల్లవరపు వెంకటరావు, ఫణితపు శ్రీరామ మూర్తి, కొండ్రెడ్డి వేంకటేశ్వర రెడ్డి, డా.బీరం సుందరరావు, బోడావుల నాగేశ్వరరావు, గంగవరపు జానకి రావు, బులుసు వేంకటేశ్వర్లు మొదలైన వారు జాన్ కవిగారి సాహిత్యాన్ని, వ్యక్తిత్వాన్నిఛందో బద్ధంగా మంచి పద్యాలను రాశారు. జాన్ కవిగారి గురించి చాలామంది మంచి వ్యాసాలు రాశారు. " మధుర కవి సాహిత్య దర్శనం" పేరుతో డా. గోగినేని యోగ ప్రభావతి గారు రాసిన వ్యాసం చాలా బాగుంది. ఇంకా ఇలాంటి వ్యాసాలు చాలా ఉన్నాయి. జాన్ కవి గారి వ్యక్తిత్వాన్ని, సాహిత్యాన్ని తెలుసుకోవాలనే వారికి ఈ సంచిక ఒక ఆకర గ్రంథంగా ఉపయోగిస్తుంది.

కం.
మాదార్ల మనసువెన్నెల
ప్రాధాన్యతనిచ్చి కవుల పండితులను తా
నాదరము జూచి మమతా
మాధుర్యమొసంగిబ్రోచు మంజుల హృదితోన్

తే.గీ.
మధుర కవి మల్లవరపు జాన్ మధుర పద్య
కవన భావ సౌరభ్య వైభవము గాంచి
మెచ్చి మెండు సమీక్షల నిచ్చి కవుల
మనసు దోచుకున్నారు నమ్మకముగలుగ!

ఈ పద్యాలను మల్లవరపు రాజేశ్వరరావుగారు నా గురించి 22 అక్టోబరు 2009లో ప్రేమతో వర్ణించినవి. నాకు మల్లవరపు జాన్ గారు, రాజేశ్వర రావుగారి కంటే ముందు వారి కుటుంబసభ్యుడైన ప్రభాకరరావు బాగా తెలుసు. ఆయన చిక్కనైన వచన కవిత్వం రాస్తారు. జాన్ కవి కుమారుడు మల్లవరపు రాజేశ్వరరావు. తండ్రి వారసత్వాన్ని నిలబెడుతూ తెలుగుపండితుడిగా పనిచేస్తూనే అనేక రచనలు చేశారు. 1949 డిసెంబరు 17వ తేదీన జన్మించిన రాజేశ్వరరావుకి 'జీవనది' పద్యకావ్య సంపుటి ఎంతో పేరు తెచ్చింది. భక్తయోబు, అనాథ గంగ, ఎయిడ్స్ మహమ్మారి, బాలగేయాలు, హన్నా, కాళింది, రజయ ప్రణయం, ఎస్తేరు రాణి మొదలైన రచనలు చేశారు. వీటితో పాటు ఈయన రాసిన కావ్యాలు, నాటకాలు ముద్రణలో ఉన్నాయి. ఈయన రాసిన 'ముంతాజ్ మహల్' పద్యకావ్యం అనేకమంది సాహితీవేత్తల ప్రశంసలు అందుకుంది. పద్యంలోరాసినప్పటికీ వీరి భాష ఎంతో సరళంగా ఉంటుంది. మల్లవరపు జాన్ కవి వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని పోతనలోని మాధుర్యాన్ని, కరుణశ్రీలోని మృదుత్వాన్ని, వేమనలోని వస్త్వలంకారాలతో సత్యాన్ని సామాన్యులకు అందించగల నేర్పునీ, జాషువాలోని సామాజిక స్పందన్నీ ఏకోన్ముఖంగా మనకి అందించగల కళానైపుణ్యం ఈయన కవిత్వంలో కనిపిస్తుంది. ఈయన రాసిన 'మల్లవరపు శతకం'లో సామాజిక సమస్యల్ని వర్ణించారు.

'మతములన్నియు జనుల
హితమునే కూర్చును/
సత్యము వాని నమ్మి
సాగువారి/బ్రతుకులందు
శాంతి భావాలు వెలుగొందు/
మల్లవరపు మాట మల్లెమూట'

అని మతం ప్రజలకు హితాన్ని కలిగించి ముందుకు తీసుకుపోవడానికి ఒక మార్గంగా ఉండాలని ధ్యాత్మకంగా ప్రబోధించారు. సమాజంలో జీవిస్తున్న బాధ్యతాయుతమైన కవిగానీ, కళాకారుడు గానీ తన చుట్టూ జరుగుతున్న వాటికి స్పందించడంలో 'కళాత్మకత' ఉంటుంది. అది బయటకొచ్చే వరకు 'పురిటి నొప్పులు' భరించాల్సిందే నన్నట్లుంటుంది. కొన్నిసార్లు 'గుం డెగొంతులో కొట్లాడుతూనే ఉంటుంది. నిలబడనీయదు. అందరిలో ఉన్నా ఒంటిరిని చేస్తుంది. ఒంటరిగా ఉన్న సమూహాన్నీ చేస్తుంది. అది బయటకొచ్చిన తర్వాత కవి గొప్ప రిలీఫ్ పొందుతాడు. కవి మల్లవరపు రాజేశ్వరరావు అటువంటి 'తల్లి' గురించెలా వర్ణించారో చూడండి. 'కనెడి వేళ తల్లి కష్టంబు పడునెంతా/ కాన్పులైన పిదప కలత మరచు/హత్తుకొనును బిడ్డ పొత్తిళ్ళలో నుంచి/మల్లవరపు మాట మల్లె మూట'. గుర్రం జాషువా స్మారక కళాపరిషత్, ప్రకాశం జిల్లా ముస్లిం రచయితల సంఘం, శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సేవా సమితి మొదలైన సంస్థలు పురస్కారాలతో పాటు, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారంతో సత్కరించింది. 2007లో ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందు కున్నారు. ఈయన రాసిన జీవనది కావ్యంపై తెలుగుశాఖ, హైదరాబాదు విశ్వవిద్యాలయంలో ఎం.ఫిల్ పరిశోధన చేశారు. రాజేశ్వరరావుగారు 24 అక్టోబరు 2018వ తేదీన మరణించారు.

***

'వసంతానికి స్వాగతం' పేరుతో1996లో మల్లవరపు ప్రభాకరరావుగారు రాసిన కవితలోని కొన్ని భాగాలు చూడండి.

"కల్లలైన కలల మధ్య
చేదు జ్ఞాపకాలలోని తీపి స్మృతుల మధ్య
అలనల్లన నడిచొచ్చే ఉగాదికి స్వాగతం'అంటూనే ఎన్ని ఉగాదులు
వచ్చినా సామాన్యులను, మధ్యతరగతిలను ఎలాంటి జీవన
పరిస్థితుల్లో నెట్టేస్తూ ఉంటాయో చెప్తూ...
'ఒక్కో వసంతం ఎన్ని తీపికలలను వెంట /తీసికొస్తుందో/
ఒక్కో వసంతం ఎన్ని వాడిన జీవితాల కథలను
వెంటకొనిపోయిందో'
పిల్లాడి స్కూల్ ఫీజుల కోసం
కాఫీ కప్పులో పంచదార కోసం
ఇంటి కొచ్చిన కొత్తల్లుడి గొంతెమ్మ కోర్కెలు తీర్చడం కోసం
మా ఆత్మాభిమానాన్ని చంపుకుంటున్నా
వసంతానికి ఆహ్వానం చెబుతుంటాం'

ఆచార్య కోయి కోటేశ్వరరావు

ఆచార్య విస్తాలి శంకరరావు

ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు

మల్లవరపు ప్రభాకర రావు

అంటాడు కవి. మల్లవరపు రాజీవ్ తన పద్దెనిమిదేళ్ల వయసులోనే 'ఇగ్నోరెంట్ బ్లిస్' (Ignorant Bliss) అనే ఆంగ్ల కవితా సంకలనం ద్వారా అద్భుతమైన పరిణతిని, విశాల దృక్పథాన్ని కనబరిచాడు. యువతకు సహజమైన ఆవేశాలకు బదులుగా, మనిషి అంతరంగం, స్వచ్ఛమైన హృదయం, తప్పుల నుంచి నేర్చు కునే పాఠాలు, జీవితం పట్ల ఆశావాదం వంటి ఉన్నతమైన అంశాలను తన కవితల్లో లోతుగా స్పృశించాడు. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సాటి మనిషితో బంధాన్ని పెనవేసుకోవాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ, సమాజంలోని కృత్రిమత్వాన్ని, మూస ధోరణులను తన కవిత్వం ద్వారా అత్యంత సుతి మెత్తగా, ప్రభావవంతంగా విమర్శించాడు. రాజీవ్ రాసిన 'విచ్ వే' (Which Way) కవిత చదువుతుంటే, సుప్రసిద్ధ అమెరికన్ కవి రాబర్ట్ ఫ్రాస్ట్ రాసిన 'రోడ్ నాట్ టేకెన్' (Road not Taken) కవిత ఇచ్చిన స్ఫూర్తి మనకు అడుగడుగునా కనిపిస్తుంది. అదేవిధంగా, 'త్రూ దేర్ ఐస్' (Through Their Eyes) కవితలో విలియం హెన్రీ డేవిస్ రాసిన 'లెయిజర్' (Leisure) కవిత తాలూకు ప్రభావం అద్భుతంగా ఒదిగిపోయిందని విమర్శకులు అన్నారు. ఒక మంచి పాఠకుడు మాత్రమే గొప్ప రచయిత కాగలడన్న నానుడిని నిజంచేస్తూ, తన విస్తృత పఠనం వల్లే ఇంతటి చిన్న వయసులో జీవిత గమ్యాన్ని, తత్వవిచారాన్ని నిష్పక్షపాతంగా, కవితాత్మకంగా ప్రపంచానికి పరిచయం చేయగలిగాడని ఈ కవితలు స్పష్టం చేస్తున్నాయి.



మల్లవరపు రాజేశ్వరరావు

మల్లవరపు కవుల కుటుంబం ఒకవైపు ప్రాచీన పద్య సంప్రదాయాన్ని, మరోవైపు ఆధునిక వచన కవిత్వాన్ని సమపాళ్లలో పండిస్తూ తెలుగు సాహిత్యానికి అమూల్యమైన సేవలు అందిస్తుంది. పద్య సాహిత్యం ద్వారా జాన్ కవి, రాజేశ్వరరావు గార్లు తమ కావ్యాల్లో సామాజికతను, భావ మాధుర్యాన్ని ఏమాత్రం లోపించనివ్వకుండా అద్భుతమైన పద్య శిల్పాన్ని చెక్కారు. అదే సమయంలో సుధాకరరావు, ప్రభాకరరావు, రాజీవ్ గార్లు వచన కవిత్వం ద్వారా సామాన్యుల కన్నీటి గాథలను, మధ్యతరగతి జీవిత పోరాటాలను ఆర్ద్రంగా ఆవిష్కరించారు. ఛందస్సుల చట్రంలో ఇమిడిన పద్యమైనా, స్వేచ్ఛగా సాగే వచన కవితైనా.... అంతర్జాతీయంగా వినిపించగలిగే ఆంగ్ల కవిత్వమైనా మల్లవరపు కవుల కలం నుండి జాలువారిన ప్రతి అక్షరం మానవతా విలువలనే సుసంపన్నం చేసింది. విభిన్న ప్రక్రియల ద్వారా సమాజ హితాన్ని కోరిన వారి సాహితీ ప్రస్థానం భావితరాల కవులకు నిరంతరం ఒక గొప్ప స్ఫూర్తిదాయకం.

నేను 1998 సంవత్సరంలో జాన్ కవి గారిని కలిసాను. అప్పుడు నాపై రెండు పద్యాలు రాశారు. హైదరాబాద్ చేరే సరికి ఆ పద్యాలున్న నా పర్సు ఎవరో కొట్టేశారు. అప్పుడు పద్యం పోయినందుకు బాధపడ్డాను. ఇప్పుడు ఆయనకు నేనే ఒక పద్యాన్ని సమర్పిస్తున్నాను.

జ్ఞాన మూర్తిగ వెలసిన జాన్ కవీంద్ర/ శత వసంతములందున శతము జేసి నిత్య కవితల గీతుల నిత్యగతిని/ అంజలిని ఘటియించుచు అభినుతింతు.

- డా.దార్ల వెంకటేశ్వరరావు
ప్రొఫెసర్, తెలుగు శాఖ,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్,
హైదరాబాద్,
ఫోన్: 9989628049

శతజయంతోత్సవ సభలో పాల్గొన్న సాహితీ వేత్తలు

ఆదివారం 19-07-2026
నినాదం
నిఖార్సైన జర్నలిజం
సాహితీ లహరి
Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288,
Gmail: sahityalahari0@gmail.com, CELL : +91 6305584064

ప్రపంచంలో వీరులు లేని దేశం, వీరగాథలు లేని సాహిత్యం లేదు. సుగాలీలు లేదా లంబాడీలను ఒకప్పుడు మాతృభూమి రక్షణ కోసం ప్రాణాలర్పించిన రాజపుత్రుల తెగకు చెందినవారిగా భావిస్తారు. అయితే వీరంతా ఆరణ్యాలు పట్టడానికి రకరకాల కారణాలు చెప్తుంగారు. నేటి ప్రాంతాన్ని బట్టి వీరిని వేర్వేరు పేర్లతో పిలిచినా, తమదైన ప్రత్యేక సంస్కృతితో 'గిరిపుత్రులు'గా వీరు గుర్తింపు పొందారు. ఈ గిరిజన జాతి జీవన విధానాన్ని, వారి పండుగలు, పాటలు, పాడుపు కథలు, భాషా వ్యాకరణాంశాలను అధ్యయనం చేస్తూ డా. ఎం. గోనానాయక్ "సుగాలి సంస్కృతి - భాషా సాహిత్యాలు" అనే పరిశోధనా గ్రంథాన్ని తీసుకువచ్చారు. బంజారా జాతిలోనే జన్మించిన ఆయన, తన సొంత అనుభవాలనే అక్షరాలుగా మలిచి చేసిన ఈ పరిశోధనకు గానూ డాక్టరేట్ డిగ్రీని అందుకున్నారు. ఆచార్య హెచ్.ఎస్ బ్రహ్మానందగారి పర్యవేక్షణలో సాగిన ఈ పరిశోధన, ఇప్పుడు ద్వితీయ ముద్రణలో మరింత విస్తృత సమాచారంతో పాఠకులకు అందుబాటులో ఉంది. అంతేకాకుండా తెలుగు సాహిత్యంలో పిహెచ్.డి. పూర్తి చేసిన తొలి గిరిజన విద్యార్థినని డా. ఎం. గోనా నాయక్ గారు చెప్తారు. అంతేకాదు, విశ్వవిద్యాలయ స్థాయిలో తెలుగు శాఖలో అధ్యాపక పదవిని చేపట్టిన మొదటి గిరిజన పండితుడు కూడా ఆయనే కావచ్చునని ప్రముఖ పరిశోధకుడు ఆచర్య తంగెడ కిషన్ రావు పేర్కొన్నారు.

గిరిజన సాహిత్యానికి అక్షర దక్షత

ఆచార్య ఎం. గోనా నాయక్

పురస్కారాలు:

1. పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం అబ్బూరి రామకృష్ణారావు- వరదరాజేశ్వరరావు స్మారక కీర్తి పురస్కారం - 2024.
2. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం తెలుగు భాష సేవా జీవిత సాఫల్య పురస్కారం - 2024
3. గిరిజన జానపద కీర్తి, కర్ణాటక ప్రభుత్వం - 2014.
4. పద్మరత్న పురస్కారం, బెల్లంపల్లి, ఆదిలాబాద్ 2013.
5. ఉగాది పురస్కారం, శరత్ జ్యోత్స్న కళాపీఠం, హైదరాబాద్ - 2013.
6. గుర్రం జాషువా పురస్కారం, వరంగల్ 2012
7. కాళోజీ శతజయంతి సమాలోచన పురస్కారం, హైదరాబాద్ 2012.
8. ట్రైబల్ లైవ్ అచీవ్మెంట్ అవార్డు, కెనడా - 2010.
9. బంజారా కవికోకిల, బంజారా సాహితీ సంస్థ, పిడుగురాళ్ళ, గుంటూరు - 2010.
10. పౌరాణిక పద్మరత్న పురస్కారం, కాకినాడ - 2008

ఆయన తొలుత ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో ప్రొఫెసర్‌గా పని చేసిన గోనా నాయక్, ప్రస్తుతం హైదరాబాద్ కేంద్ర విశ్వ విద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. తన జాతి సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించాలనే అంకితభావంతో ఆయన చేసిన ఈ కృషి, గిరిజన సాహిత్య చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది. ఆయన కొన్ని ముఖ్యమైన గ్రంథాలు రచించారు. ఆయన 2016లో "బంజారా భాష సంగ్రహ వ్యాకరణ పరిచయం" గ్రంథాన్ని రాశారు. ఆయన "బతుకు దీర్ఘ కవిత"(2022), "మా నాయిన సెప్పిన కతలు" (2023), "సుగాలి సంస్కృతి భాషా సాహిత్యాలు"(2024), ద్వితీయ ముద్రణను తీసుకువచ్చారు. 2024 లోనే "భారతీయ గిరిజన వీరులు" గ్రంథాన్ని కూడా రాశారు. 2026లో "పూజారి మాన్యవర్య శతకం" గ్రంథాన్ని రచించారు.

బంజారా భాష సంగ్రహ వ్యాకరణ పరిచయం:

ఆచార్య ఎం. గోనా నాయక్ గారు తన గురువు ఆచార్య హెచ్.ఎస్. బ్రహ్మానందం గారితో కలిసి 'బంజారా భాష సంగ్రహ వ్యాకరణ పరిచయం' అనే గ్రంథాన్ని రచించారు. ఇందుకోసం వారు భారతదేశంలోని దాదాపు 17 రాష్ట్రాలలో నివసించే బంజారాల భాషా సమాచారాన్ని సేకరించారు. ఈ పుస్తకంలో బంజారా భాషా అంశాలను తెలుగు వ్యాకరణంతో జోడిస్తూ వివరించారు. ఈ గ్రంథంలో బంజారాల ప్రస్థానం, వలస చరిత్ర, గోర్ బోలీ భాషా హోదా, జాతి గుర్తింపు, వ్యాకరణ పరిచయం, మాండలికాల వ్యాప్తి అనే ఆరు విభాగాలను మనకు పరిచయం చేశారు. ఈ అమూల్యమైన పరిశోధనా గ్రంథాన్ని రచించినందుకు గాను ఆచార్య గోనా నాయక్ గారికి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంవారి ప్రతిష్ఠాత్మక 'అబ్బురి రామకృష్ణారావు- వరద రాజేశ్వరరావు స్మారక కీర్తి పురస్కారం' దక్కింది.

సుగాలి సంస్కృతి - భాషా సాహిత్యాలు:

డా॥ ఎం. గోనానాయక్ గారు డా॥ హెచ్.ఎస్. బ్రహ్మానంద గారి పర్యవేక్షణలో 'సుగాలి సంస్కృతి భాషా - సాహిత్యాలు' అంశంపై పరిశోధన చేసి 1993లో పిహెచ్.డి. పట్టా పొందారు. సుగాలి-బంజారా సంస్కృతి పై తెలుగులో వెలువడిన మొట్టమొదటి పరిశోధనా గ్రంథమిది. 257 పేజీల ఈ గ్రంథం ఏడు అధ్యాయాలుగా విభజించారు. ఇందులో బంజారాల చరిత్ర, సామాజిక వ్యవస్థ, పండుగలు, భాష, గేయాలు, కథలు పొడుపు కథలను సమగ్రంగా వివరించారు. ఈ పుస్తకంలో బంజారాల ఐదు వంశాల వివరాలు, వారి 'తాండా' జీవన విధానం, 'నాయక్' నేతృత్వం లోని కుల పంచాయితీ వ్యవస్థను చక్కగా చర్చించారు. అలాగే తుల్జా భవాని పూజ, తీజ్ పండుగ విశేషాలు, విలక్షణమైన వివాహ గేయాలు, 'గోర్‌బోలి' భాషా విశిష్టతను గ్రంథకర్త వివరించారు. జానపద కథలు, పొడుపు కథలతో కూడిన ఈ గ్రంథంలో విశ్లేషణ కంటే వివరణకు ప్రాధాన్యత నిచ్చారు రచయిత.

భారతీయ గిరిజన వీరులు:

"భారతీయ గిరిజన వీరులు" అనేది మూడు దశాబ్దాల పాటు సాగిన సుదీర్ఘ పరిశోధనా గ్రంథంగా రచయిత చెప్పుకున్నారు. కాగా, ఇందులో మనకు తక్కల్ చందు, తిల్కా మాంఝీ, పూలో ఝానో ముర్ము, రాణిదుర్గావతి, సింగిదాయి వంటి 56 మంది భారతీయ గిరిజన వీరులు కనిపిస్తాయి. ఈ పుస్తకంలో అనాదరణకు గురైన గిరిజన వీరుల, వీరవనితల త్యాగాలను అక్షరబద్ధం చేసి సమాజానికి పరిచయం చేశారు. ఈ అమూల్యమైన పరిశోధనకు తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ - శిశు సంక్షేమ, గ్రామీణ అభివృద్ధి శాఖామాత్యులు డా. దనసరి అనసూయ (సీతక్క) గారు **"మాది ఎప్పుడు ముందు వరకే కానీ...."** అనే శీర్షికతో హృదయాలను కదిలించే అద్భుతమైన ముందు మాటను అందించారు. గిరిజన జాతి అస్తిత్వాన్ని, పోరాట పటిమను వెలుగులోకి తెస్తూ సాగిన ఈ అక్షర యజ్ఞాన్ని, జాతి మూలాలను గౌరవించిన ఆచార్య గోనా నాయక్ గారి శ్రమను ఆమె మనస్ఫూర్తిగా అభినందించారు. ఈ గ్రంథం గిరిజన సాంస్కృతిక వైభవానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. ఈ పుస్తక పరిచయంలో ఆచార్య ఎం. గోనా నాయక్ గారు నదీం హస్ నైన్ గారు పేర్కొన్న విదేశీ పాలకులకు వ్యతిరేకంగా మొట్టమొదట పోరాడి, స్వాతంత్ర్య సమరానికి తొలిగా బరి గీసింది గిరిజనులే కాబట్టి, వారి అపారత్యాగాలను గుర్తించినప్పుడే వారికి నిజమైన న్యాయం జరుగుతుంది. అని అన్న మాటను మనకు గర్తు చేశారు. 'ఏ దేశ సంస్కృతి కూడా ఒక స్థిర బిందువు కాదు' అని తిలక్ గారు అన్నప్పటికీ, చాలా శతాబ్దాల వరకు గిరిజనుల జీవితాలు అడవిని నమ్ముకొనే కొనసాగాయి. మన దేశంలో సుమారు 10.4 కోట్ల మంది గిరిజనులు ఉండగా, నాగరిక ప్రజల విలువలను తమపై రుద్దుకోవడం అనవసరమని భావించి, వారు హిందూ నాగరికత ప్రభావానికి వెలుపల ఉంటూ అడవులను వదిలి రాలేదని హెమాన్ డార్ఫ్ అంచనా వేశారు. గిరిజన తెగలలో కుటుంబం కంటే ముందు సమూహ సంచార జీవితాలు ఉండేవి, అందు వల్లనే ఇంటికి పెద్ద ఉన్నట్టుగానే గ్రామానికి కూడా నాయక్, మంజీ, పటేల్, ముండా, సర్దార్, షాలు అనే పేర్లతో పిలువబడే గ్రామ పెద్దలు ఉండేవారు.

సర్వ అధికారాలు కలిగిన ఈ గ్రామ పెద్దరికం తరతరాలుగా వారసత్వంగా పెద్దకొడుకుకు లేదా మేనల్లుడికి వస్తుండగా, ఆయనకు సలహాలివ్వడానికి రెండో శ్రేణి పెద్దలు ఉండేవారు. గ్రామ పెద్దలు పొలంలో మిగతావారు కూలీ లేకుండా పనిచేసే వారని, గ్రామానికి సంబంధించిన అన్ని సాంస్కృతిక, ఆర్థిక విషయాలలో ఆయనకే తొలి ప్రాధాన్యత, జ్యేష్ఠ భాగం, అగ్రతాంబూలం లభించేవని తెలుస్తోంది. గిరిజన గ్రామ న్యాయ వ్యవస్థలో గ్రామ పెద్దయే ప్రధాన న్యాయనిర్ణేతగా వ్యవహరించే ఈ సంప్రదాయానికి సామ్రాజ్య రాజుల కాలంలో ఎంతో విలువ ఉన్నప్పటికీ, మొఘలులు, బ్రిటీషు పాలకుల రాకతో వారి జీవితాలలో అలజడులు రేగాయి. అయినప్పటికీ, గిరిజనులు అమాయకులైనా ఎంతో ఆత్మాభిమానం కలవారు కావడం వల్లే

వారిలో తిరుగుబాట్లు, పోరాటయోధులు అధికంగా పుట్టుకొచ్చారు. ఆర్థిక పరంగా చూస్తే, తొలినాళ్ళలో ఎలాంటి ద్రవ్య విధానం లేకపోవడం వల్ల గిరిజనులు తమ అవసరాలను వస్తుమార్పిడి పద్ధతి ద్వారానే తీర్చుకున్నారు. మిగతా సమాజం నాణేల రూపంలో ద్రవ్య వినిమయం చేస్తున్నప్పుడు కూడా వారు ప్రధాన జీవన స్రవంతికి దూరంగా ఉండడం వల్లే వస్తు మార్పిడిలోనే ఉండిపోయారు. భారతదేశంలో గిరిజనుల ఆహారోత్పత్తి, దినచర్యను ప్రమాణంగా చేసుకుని వారిని వేట-అటవీ ఉత్పత్తుల సేకరణ, వేట-పోడు వ్యవసాయం, వేట-పశు పోషణ అని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు, ఇందులో వేట వారి ఆకలిని తీరిస్తే మిగిలిన పనులు వారిని ఆర్థికంగా బలోపేతం చేశాయి. స్వదేశీ రాజులతో గిరిజనులకు కొంతమేరకు కేవలం సంఘర్షణలు మాత్రమే ఉండేవి, కానీ విదేశీ పాలకుల చట్టాల వల్ల వారు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొఘలులు, బ్రిటీషు పాలకుల రాకతో అటవీ ఉత్పత్తులపై పన్నులు విధించడం, కొన్ని సమూ హాలను క్రిమినల్ జాబితాలో చేర్చడం వంటి చర్యలు అడవి బిడ్డలకు ఆగ్రహం తెప్పించి తిరుగుబాట్లకు దారి తీశాయి. ఫలితంగా చరిత్రలో కోల్, సంతాల్, ముండా, నాగా, మిజో, బస్తర్ తిరుగుబాట్లతో పాటు రంప పితూరీ, కురియా పితూరీ, కొమరం భీమ్ సాగించిన జల్-జమీన్-జంగిల్ పోరాటాలు నిలిచిపోయాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా గిరిజన ప్రాంతాల్లో ఎన్నో ఉద్యమాలు జరిగాయి. గిరిజనేతరుల ప్రవేశం, వారి ఆధిపత్య ధోరణి, పెద్ద పెద్ద ప్రాజెక్టుల పేరుతో గిరిజనులు తమ నివాసాలను కోల్పోయి నిర్వాసితులు కావడం వంటి అన్యాయాల వల్లే గిరిజనులు నేటికీ తిరిగి ఉద్యమబాట పడుతున్నారు.

బంజారా సంస్కృతీ వైభవానికి సజీవ సాక్ష్యాలు : మా నాయన చెప్పిన కథలు

అది 1988వ సంవత్సరం. ఆచార్య ఎం. గోన నాయక్ గారు ఎం.ఏ. ద్వితీయ సంవత్సరం చదువుతున్న రోజుల్లో బంజారా సాహిత్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. ఆ సమయంలోనే వారు తమ తండ్రిగారైన కీ॥శే॥ ఎం. భావ్యానాయక్ గారి నుండి ఎన్నో అమూల్యమైన కథలను సేకరించారు. బంజారాలలో కథా గేయాలు

పాడటానికి రాత్రి సమయం కావాలి, లేదా సమూహంగా నగారా వాయిస్తూ పాడే ప్రత్యేక సందర్భం కావాలి. కానీ, కథలు చెప్పడానికి అలాంటి నియమాలేవీ లేవు. అందుకే కాస్త ఖాళీ సమయం దొరికినప్పుడల్లా హను మంతప్ప సార్, గోన నాయక్ గారు కలిసి భావ్యానాయక్ గారు చెప్పిన 14 కథలను ఎంతో శ్రమకోర్చి రికార్డు చేశారు. ఆ రికార్డింగ్‌ల ఆధారంగా ఈ కథల ప్రతిని సిద్ధం చేశారు. వీరు సేకరించిన కథలలో దాదామోలా-దాదిమోలి, యాలంరాజు కథ, నలరాజు కథ, ఘోలారాణి కథ, సురా-హాము, బీద రాజు, కోమటోని కథ, సేవా భాయ్ కథ, గరీబ్ రాజు కథ, సోనీ రాజు బెల్లం రాజు కథ వంటివి ప్రధానమైనవి. ఈ 14 కథలలో బంజారాల సంస్కృతి, వారి పూర్వీకుల ఆచార సంప్రదాయాలు, కరువులు, బలి విధానాలు, మాయలు, మంత్రాలు సమృద్ధిగా కనిపిస్తాయి.

అలాగే నాటి రాజరిక వ్యవస్థ, వారి న్యాయ పద్ధతులు, వివాహ ఆచారాలు, వేషధారణ, ఆభరణాలు మొదలైన ఎన్నో విషయాలు ఈ కథలలో మనకు దర్శనమిస్తాయి. బంజారా లలో 'మోటామోలా' అనే కథ చాలా ప్రసిద్ధి చెందింది. అయితే అంతకంటే ముందే వారిలో 'దాదామోలా-దాదిమోలి' కథ ప్రచారంలో ఉంది. ఇది రాయలసీమ బంజారాల ప్రధాన కథగా గుర్తింపు పొందింది. పురాణాలలో ఉన్న నలమహారాజు కథ కూడా బంజారాలలో జానపద మౌఖిక కథగా ప్రసిద్ధి చెందింది. ఈ కథలాగే యాలంరాజు, గరీబు రాజు, సేవాభాయా, లింబుడా నాయక్, దేశుడానాయక్ల కథలు వారి పూర్వపు రాజరిక వ్యవస్థలకు సజీవ ప్రతిబింబాలుగా నిలుస్తాయి. ఇవి కేవలం నోటి మాటగా ప్రచారంలో ఉన్న జానపద మౌఖిక కథలే కావచ్చు, కానీ వీటిలో బంజారాల బ్రతుకు చిత్రాలుగా వారి సంపూర్ణ జీవనసరళి మన కళ్లకు కట్టినట్టుగా కనిపిస్తాయి.

బతుకు దీర్ఘ కవిత:

మనం అమ్మ ఒడిలో పడిన మొదటి రోజు నుండే మన బతుకు ప్రయాణం మొదలవుతుంది. అప్పటినుండే మన జీవితంలో భూత, వర్తమాన, భవిష్యత్ కాలాలు ఏర్పడుతాయి. బాల్యం నుండి మన జీవన విధానం క్రమంగా పెరుగుతుంది. ఈ ప్రయాణంలో మనకు ఎన్నో అనుభవాలు, తీపి జ్ఞాపకాలు ఎదురవుతాయి. అలాగే మన బతుకులో కష్టాలు, సుఖాలు కూడా భాగమవుతాయి. సమాజంలో బతుకుతూ మనం ఎన్నో రకాల బంధాలను ఏర్పాటు చేసుకుంటాం. ఇటువంటి అనేక విషయాలను ఆచార్య ఎం. గోనా నాయక్ గారు అక్షరబద్ధం చేశారు. ఈ కావ్యం గురించి ముందుమాట రాస్తు ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారు ఇలా అన్నారు.

> **"బతుకు" కావ్యమంతా ఒక చలనచిత్రంలా మన కళ్ళముందు కదలాడుతుంది. ఒక లంబాడి కుర్రవాడు జీవితంలో ధక్కామొక్కీలు తిని నానాకష్టాల పాలై, అవమానాల గొంగడేసుకుని ఒక విశ్వవిద్యాలయ స్థాయి ఆచార్యుడు కావడం అంటే తమాషా కాదు"**

అని వ్యాఖ్యానించారు. బాల్యం అమూల్యం అనే కవిత మొదలుకొని చివరి కవిత బతుకు వరకు మనకు ఒక్కో కవిత ఒక జీవిత పాఠాన్నిపాఠకునికి అందిస్తుంది.

> **"కేవలం బండలుగా మాత్రమే కనిపించే కొండల గుండెల గుసగుసలు తెలియాలంటే ఈ కావ్యం చదవాలి. ప్రకృతిలో పారవశ్యంగా పాడుకునే పక్షుల కిలకిల రావాల మాధుర్యాన్ని హృదయంలో దాచుకోవాలంటే ఈ కావ్యాన్ని చదవాలి"**

అని ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు ఈ పుస్తకానికి రాసిన ముందుమాటలో అన్న మాట నిజమనిపిస్తుంది. ముఖ్యంగా ప్రతి ఏటా ఆగస్టులో జరిగే 'గంప మాలయ్య కొండ జాతర' అతని జీవితంలో ఒక మరువలేని తీపి గుర్తుగా. జాతరలో రంగులరాట్నాలు, మిఠాయిలు చూసి మురిసిపోయినా, జేబులో డబ్బులు లేక దూరం నుంచే చూసి ఆనందించిన ఆ పసితనపు జ్ఞాపకాలు, అతని మనసులో ఎప్పటికీ ఇంకిపోని నీటి చెలమలా సజీవంగా నిలిచిపోయాయి. అలాగే వారి తాతగారు రూప్లానయక్ న్యాయం, దాన గుణం, ఇలా అన్ని కలిపి బంజార జాతికి ఒక మణిదీపంలా మనకు దర్శనమిస్తారు. బతుకు కవిత చదవడం మొదలు పేడితే ఆపకుండ చదవాలి అని మనకు అనిపిస్తుంది. చివరి కవిత బతుకులో తన జీవితాన్ని చూపిస్తారు.

> **గత వర్తమానాల్లో/సుదీర్ఘ నా జీవిత పయనంలో/ జ్ఞాపకాలాన్ని నా యీ జ్ఞానాన్ని/ అక్షరాలై వృక్షమంత ఎత్తు కెదిగాయి, ఎదుగుతున్నాయి/మంచి నేర్పింది నా బతుకు లక్ష్యాలను/ శ్రమఫలం చేసింది నా బతుకు....**

ఈ కవితలో జీవిత పయనంలో జ్ఞాపకాలే అక్షరాలై వృక్షమంత ఎత్తుకు ఎదిగాయి. ఆయన బతుకు ఆయనకు మంచిని నేర్పింది, శ్రమఫలంతో లక్ష్యాలను సాకారం చేసింది. జీవితంలోని కష్టాలను ఆయన ఇష్టంగా స్వీకరించి పరిష్కరించుకున్నారు. ఆయన డబ్బు కన్నా విలువైన జ్ఞాపకాలనే దాచుకుంటున్నారు. లోకంలో అందరూ ప్రేమ, సఖ్యతలతో సుఖంగా బ్రతకాలని ఆయన ఆశిస్తున్నారు. సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులు అందరికీ రక్షగా నిలవాలని కోరుకుంటున్నారు. ఈ భూమి స్వర్గతుల్యం కావడమే తన బతుకు దీర్ఘకవిత పరమార్థమని ఆయన ముగించారు.

> **మొత్తం మీద ఈ కావ్యం గోనా నాయక్ గారి జీవితంలా అనిపిస్తున్నా, గిరిజనుల అందరి జీవితాలను కూడా సాధారణీకరించవచ్చునని ఆచార్య బన్న అయిలయ్య గారు వ్యాఖ్యానించింది నిజమనిపిస్తుంది.**

పూజారి మాన్యవర్య శతకం : మాన్యవర్యశతకం' ఆధునిక కాలంలో సద్గురుత్వానికి, నిరుపమాన సేవాభావానికి

అద్దం పట్టే ఒక అద్భుతమైన అక్షరరూపం. పూజారి రంజిత్ నాయక్ గారి వ్యక్తిగత ఆధ్యాత్మిక సాధనతో, ఉన్నతమైన జీవన శైలితో మొదలైన ప్రయాణం కేవలం తనకే పరిమితం కాకుండా, సమాజంలో గొప్ప మార్పును తీసుకువచ్చేలా ఎలా విస్తరించిందో ఈ శతకం ఆవిష్కరిస్తుంది. "ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు గారు ***"సమకాలీన సద్గురు దర్శనం 'మాన్యవర్య' శతకం"*** అనే శీర్షికతో రాసిన ముందుమాటలో

"రంజిత్ నాయక్ గారు స్థాపించిన సేవాలాల్ మహారాజ్ ట్రస్టు ప్రస్తావన ద్వారా ఆయన సేవకు సామాజిక దిశ స్పష్టమవుతుంది. గిరిజనులలో ఆత్మవిశ్వాసాన్ని నాటడంతోపాటు, వారికి ఒక గుర్తింపును, గౌరవాన్ని, స్వయం సామర్థ్యాన్ని తిరిగి ఇచ్చే సాంస్కృతిక పునర్నిర్మాణ ఉద్యమం. అందుకే కవి ఆయనను "మహితసద్గురుపూజారి! మాన్యవర్య!" అని సంబోధిస్తారు. ఇది ఒక ఉద్యమ నాయకునికి ఇచ్చిన గౌరవముద్ర. ఈ పద్యం ద్వారా పూజారి రంజిత్ నాయక్ వ్యక్తిత్వం, సేవ, దృష్టి అన్నీ కలిసి గిరిజన సమాజానికి వెలుగు దీపంగా నిలిచిన మహానుభావుడి ప్రతిమను మనందరి ముందు నిలుపుతారు కవి"

అని వ్యాఖ్యానించారు. మన జీవితం ఉన్నంత కాలం మంచి పనులు చేస్తూ శుభాలు పొందాలి. దానధర్మాలు చేస్తూ సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలి. ఉత్తమ గురువును ఎల్లప్పుడూ పూజించాలి. ఆయన మాటలను గౌరవిస్తూ సన్మార్గంలో నడవాలి. అదేవిధంగా, సమాజంలోని మూగజీవాలను అమితంగా ప్రేమించాలి. మనుషుల మధ్య ఎటువంటి ప్రాంతీయ భేదాలు చూపకూడదు. అందరినీ సమానంగా ఆదరించడం అలవాటు చేసుకోవాలి. జీవితంలో ఎదురయ్యే కష్టసుఖాలను సమానంగా స్వీకరించాలి. ప్రతి ప్రాణిపై దయ చూపే గొప్ప గుణాన్ని కలిగి ఉండాలి. ఈ పద్యాలలో రంజిత్ నాయక్ గారిపై ఉన్న మధురమైన భక్తి మనకు కనిపిస్తుంది.

ఆచార్య ఎం. గోనానాయక్ గారు తన పరిశోధనలు, రచనల ద్వారా గిరిజన (బంజారా) జాతి అస్తిత్వాన్ని, వారి సంస్కృతీ సంప్రదాయాలను, వీరుల త్యాగాలను ప్రపంచానికి చాటిచెప్తున్నారు. అమాయకత్వం, ఆత్మాభిమానం కలబోసిన గిరిజనుల జీవన సరళిని, గురు భక్తిని, మానవీయ విలువలను తన అక్షరాల్లో సజీవంగా నిలిపారు. కేవలం నోటి మాటగా మిగిలిపోయిన మౌఖిక సాహిత్యాన్ని గ్రంథస్థం చేస్తూ ఆయన సాగించిన ఈ అక్షర యజ్ఞం, భావితరాలకు వారి మూలాలను అందించడంలో గిరిజన సాహిత్య చరిత్రలోనే ఒక చెరగని మైలురాయిగా నిలిచిపోతుంది.